క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మంగళవారం శంకుస్థాపన చేశారు. స్థానిక మునసబువారి వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు సుమారు రూ. 19 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, యూజీడీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. రూ. 14 లక్షలతో సీసీ రోడ్లు, రూ.5 లక్షలతో యూజీడీ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ నాయకుడు మువ్వల సురేష్, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

ఏయూక్యాంపస్: శ్రీ పోలమాంబ అమ్మవారి మారువారం వేడుకను పురస్కరించుకుని పెదవాల్తేరులోని ఇండియన్ ఆర్మీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విశ్రాంత సైనికోద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పెదవాల్తేరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిలపాలెం: ఈపీడీసీఎల్ జోన్ 1 పరిధి మద్దిలపాలెం శివాలయం 11కేవీ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్ 1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ఎంవీపీ అపార్ట్‌మెంట్, కేఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రామాలయంలో అన్న సమారాధన



భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి సంజీవినగర్‌లో రామాలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. భక్తులు సీతారాములను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో ఎమ్మెల్సీ పాల్గొని, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సంఘం పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ హోమం

గాజువాక: పాతకర్ణవానిపాలెంలోని రామాలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా శ్రీరామ హోమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు, నవగ్రహ మండప పూజ, మహారుద్రాభిషేకం చేశారు. బుధవారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ పెద్దలు కరణంరెడ్డి నర్సింగరావు, సిరసపల్లి అప్పారావు తెలిపారు.

మహోన్నత సంఘ సంస్కర్త పూలే

- సమాజానికే జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు
- కొనియాడిన వక్తలు
- జయంతి వేళ ఘన నివాళులు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అక్కరమాని తదితరులు



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: సమాజ సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని ఏయూలోని పూలే విగ్రహానికి రిజిస్ట్రార్ మంగళవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్యతో సమాజంలో విప్లవాన్ని, సాధికారతను సాధించవచ్చని పూలే ఆచరణలో చూపారన్నారు. సామాజిక మార్పులకు నాంది పలికిన మహనీయునిగా అందరి మనసుల్లో పూలే నిలిచిపోయారన్నారు. బీసీ లెజిన్ ఆఫీసర్ ఆచార్య పి.విశ్వనాథం మాట్లాడుతూ సామాజిక దురాచారాలను రూపుమాపడానికి కృషి చేసిన సంఘ సంస్కర్తగా పూలే నిలుస్తారన్నారు. దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వర రావు మాట్లాడుతూ దేశ యువతకు పూలే జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. విద్య విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు మాట్లాడుతూ సామాజిక శాస్త్రవేత్తగా పూలే నిలుస్తారన్నారు. సమాజంలోని అసమానతలు, వివక్షలపై అవిశ్రాంత పోరాటాన్ని చేశారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహా రావు, కె.శ్రీనివాస రావు, వి.విజయలక్ష్మి, ఎస్.కె. భట్టి, వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్యులు ఎస్.హరనాథ్, ఎన్.ఎ.డి.పాల్, జి.సుధాకర్, పి.వెంకటేశ్వర్లు, ఇతర ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రాంగణంలో పూల మొక్కలను నాటారు.

సమాజహితునికి సర్వదా నివాళి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు నెహ్రూనగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, పి.ఐ. బాలరాజు, మోహన్, శ్రీనివాస్, రాజులమ్మ, పాల్గొన్నారు.

13వ వార్డులో..

జీవీఎంసీ 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.కె.ఎం.ఎల్. నగర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలులు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, శిరీష, దుర్గారావు, పోలారావు, అప్పలనాయుడు, సీహెచ్ సత్యనారాయణ, లక్ష్మి, కొండమ్మ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో..

మహారాణిపేట: సమ సమాజ స్థాపనకుఅహర్నిశలు కృషి చేసి కులన దీశాలి, రచయిత మహాత్మా జ్యోతిరావుపూలే అని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో) శ్రీరామ్మూర్తి అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో పూలే జయంతిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో వెనుక బడిన తరగతుల కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాద్, సెట్విస్ సీఈవో సాంబిరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం

ఎంవీపీకాలనీ: అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. సమసమాజ నిర్మాణంలో ఆయన పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికల చదువుకు బాటలు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పూలే స్ఫూర్తితో యువత చదువుతో పాటు సమాజ సేవను అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్యనాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: పూలే జయంతిని మద్దిలపాలెంలోని ఎన్ఎంయూ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఇతర ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ విశాఖ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.ఎస్.ఆర్.కృష్ణారావు, బి.నీలకంఠం, రీజనల్ బాధ్యులు కె.ఎస్.ఎన్.మూర్తి, ఎ.కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.



13వ వార్డులో జ్యోతిరావు పూలేకు వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి



పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు



12వ వార్డులో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సివిల్ సప్లై అధికారులకు బియ్యం అప్పగింత



సివిల్ సప్లై అధికారులకు పోలీసులు అప్పగించిన పీడీఎఫ్ బియ్యం

ఆరిలోవ: ఆరిలోవ పోలీసులు పట్టుకున్న పీడీఎఫ్ బియ్యాన్ని మంగళవారం పౌర సరఫరాల అధికారులకు అప్పగించారు. పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన తేజ ఆటోలో పీడీఎఫ్ బియ్యం రైస్ మిల్లుకు తరలిస్తుండగా హనుమంతవాక వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న ఆరిలోవ పోలీసులకు ఆదివారం రాత్రి బియ్యం పట్టుబడిన విషయం తెలిసిందే. సోమవారం తేజపై ఆరిలోవ పోలీసులు పీడీఎఫ్ బియ్యం తరలిస్తున్నట్లు కేసు నమోదు చేశారు. ఆయన వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న 20 బస్తాల బియ్యం (సుమారు 1000 కిలోలు) మంగళవారం పోలీసులు తమకు అప్పగించినట్లు సివిల్ సప్లైఖైర్ఐ రమేష్ తెలిపారు. ఈ బియ్యాన్ని పౌర సరఫరాల గొడౌన్‌లో భద్రపరుస్తామని ఆయన తెలిపారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఆరిలోవ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి సంజీవినగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అక్కరమాని విజయనిర్మల స్థానిక కార్పొరేటర్ స్వాతి, పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి మహిళలు, యువకులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ పథకాలతో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అవకాశం కలుగుతుందన్నారు. వీటిని వినియోగించుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఐదో రోజూ తగ్గని జోష్

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'



లబ్ధిదారుకు కరపత్రాన్ని అందజేస్తున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం: నియోజకవర్గంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం హుషారుగా సాగుతోంది. మంగళవారం 15,16,23 వార్డుల్లో పార్టీకి చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి పలు వివరాలు సేకరించారు. జీవీఎంసీ 15వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పాల్గొన్ని ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. గృహ యజమానుల ఆమోదంతో ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌పై సమీక్ష

ఎంవీపీకాలనీ: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఈ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ ప్రతి వార్డులోను జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పైనా, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనపైనా ప్రజల్లో మరింత అభిమానం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పార్టీ పట్ల, ముఖ్యమంత్రి పట్ల అభిమానం విస్తృతంగా వెల్లడవుతోందన్నారు. ఈ నేపథ్యంలో వార్డుల వారీగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

వేసవి వేళ జాగ్రత్త సుమా..



తోటగరువు హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాల వద్ద పిల్లలు

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ వద్ద విద్యార్థులు ఉత్సాహంగా వ్యాయామం చేస్తున్నారు. జీవీఎంసీ మూడేళ్ల క్రితం పాఠశాల ఆవరణలో జిమ్ పరికరాలు ఏర్పాటు చేసింది. విద్యార్థులు పీఈటీ పీరియడ్‌లో అక్కడ చేరి, హుషారుగా కసరత్తులు చేస్తున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇదే దృశ్యం కనిపించింది. అయితే ఎండాకాలం విద్యార్థులు జాగ్రత్తలు పాటించేలా చూడాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



విద్యార్థికి కళ్లద్దాలు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీవీ సహాయ చారిటబుల్ ట్రస్ట్ మరియు మొహసిన్ స్కూల్ హెల్త్ ఐకేర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 42 మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందజేశారు. గత నెలలో పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి, దృష్టిలోపం ఉన్న కొందరు విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వారికి మంగళవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో స్కంద షష్టి పూజలు



కంచరపాలెం: స్థానిక ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో చైత్రమాస శుద్ధ షష్టి మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్ దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంద షష్టి పూజలు చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

17న సెయింట్ జోసెఫ్‌లో జాతీయ సెమినార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిస్టర్ షైజీ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 'యువత సమగ్రాభివృద్ధిలో విద్య, సాహితీ సంస్కృతుల పాత్ర' అనే అంశంపై తెలుగు, హిందీ, సంస్కృతం, ఇంగ్లీషు భాషల్లో సెమినార్ నిర్వహించనున్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ఈ విషయం తెలిపారు. సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. కన్వీనర్, ద్వితీయ భాషా విభాగాల అధ్యక్షులు డాక్టర్ పీకే జయలక్ష్మి మాట్లాడుతూ ఈ సెమినార్ తమకెంతో ప్రతిష్టాత్మకం అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9246362689, 7981032141 నంబర్లలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కో-కన్వీనర్లు డాక్టర్ సుధ, డాక్టర్ నిర్మల, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ దీప్తి, డాక్టర్ గౌరీనాయుడు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ మారువారం పండగ



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో పోలమాంబ అమ్మవారు

ఏయూక్యాంపస్: పోలమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో చిరువ్యాపారులు వివిధ దుకాణాలు ఏర్పాటు చేసి అలంకరణ, ఆట వస్తువుల విక్రయాలు జరిపారు. ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

గాజువాక: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలు తెరవకముందే సిద్ధంగా ఉంచడం కోసం మండల స్థాయిలో ఒక స్టాక్ పాయింట్‌ను సిద్ధం చేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ పాయింట్‌ను ఆర్జేడీ జ్యోతి కుమారి మంగళవారం పరిశీలించారు. జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, గాజువాక మండల విద్యాశాఖాధికారి బి.పైడినాయుడు తదితరులతో పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ తొలుత ఇక్కడి గదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది 50 పాఠశాలల విద్యార్థులకు సుమారు 8,700 కిట్లను ఇవ్వనున్నట్టు తెలిపారు. జగనన్న విద్యా కానుక కిట్లను క్రమ పద్ధతిలో స్కూల్ పాయింట్లకు చేర్చాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఉన్న మొత్తం సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అరుణ్ కుమార్, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీవో బి.అప్పలనాయుడు, సీఎంవో సీహెచ్.శిరీష రాణి తదితరులు పాల్గొన్నారు.

నడుపూరు జెడ్పీ హైస్కూల్లో..

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కానుక కిట్లను ఉంచే స్టాక్‌పాయింట్‌ను ఆర్జేడీ జ్యోతికుమారి, జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పెదగంట్యాడ మండల పరిధిలో ఈ ఏడాది సుమారు 35 స్కూళ్లకు సంబంధించి 5,325 కిట్లను పంపిణీ చేయనున్నామని తెలిపారు. హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రయోజనాలను వివరిస్తున్న వరలక్ష్మి

పెదగంట్యాడ: పౌష్టికాహారంతో చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని వాసవ్య మహిళా మండలికి చెందిన కుశాల్ మెటర్నల్ హెల్త్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వరలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు ప్రియదర్శిని కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, రుతు విరతి దశలో ఉన్న మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఐసీడీఎస్, కుశాల్ ప్రతినిధులు రాగి లడ్డూ, కొర్రలతో ఉప్మా చేసి పెట్టారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, మహిళా పోలీస్ శ్రావణి, ఆశ, అరుణ, అరుణాభాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సమాఖ్య నూతన కమిటీ



జేఎం నాయుడు



జీటీవీ సుదర్శన్

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య విశాఖ జిల్లా నూతన కమిటీ ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడిగా జేఎం నాయుడు (ఏపీపీటీడీ), ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ ప్రధాన కార్యదర్శిగా జీటీవీ సుదర్శన్ పట్నాయక్‌ను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖలో జరిగిన 70 అనుబంధ సంఘాల ఏపీజీఈఎఫ్ సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్న జిల్లా కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. నూతన కమిటీలో కన్వీనర్‌గా ప్రొఫెసర్ పుల్లారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరుణాకర్‌రావు, ఉపాధ్యక్షులుగా నీలాపు శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, కార్యదర్శులుగా విష్ణుమూర్తి, భార్గవ్, వి. శ్రీను, హెన్నా, కోశాధికారిగా చిరంజీవి, ప్రచార కార్యదర్శులుగా శ్రీరామమూర్తి, అప్పలనాయుడు, కేఎల్ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర నాయకుడు పి. శ్రీనివాసరావు, కన్వీనర్‌గా ఖాదర్‌బాబా వ్యవహరించారు.

దృశ్య,శ్రవణ వాహనాల ద్వారా అవగాహన



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పారావు

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా దృశ్యశ్రవణ వాహనాల ద్వారా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. జ్ఞానాపురం, కంచరపాలెం మెట్టు, ఎన్ఏడీ జంక్షన్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం కంచరపాలెం సీఐ మళ్ల అప్పారావు ఆధ్వర్యంలో జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ వరకు ముఖ్య కూడళ్లలో రోడ్డు ప్రమాదాల దృశ్యాలను చూపిస్తూ అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు పాటించాలని, హెల్మెట్ తప్పక ధరించాలని సీఐ అప్పారావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పాపారావు, అన్వర్ ఉల్‌హక్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.